క్లుప్తంగా

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ కనకదుర్గ

సత్తుపల్లిటౌన్: పోషకాహారం తీసుకోవటం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. బుధవారం పట్టణంలోని గుడిపాడు పాఠశాలలోని సెక్టార్ ఆధ్వర్యాన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహారం అవశ్యకతను వివరించి పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

షాదీఖానా సమస్యపై ఆర్డీఓకు వినతి

కల్లూరు: కల్లూరు పట్టణంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన షాదీఖానా పనులు అనివార్య కారణాల వల్ల మధ్యలో ఆగిపోయింది. ముస్లిం సోదరులు ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్‌ను ఆహ్వానించి షాదీఖానా సమస్యను వివరించగా.. ఎమ్మెల్యే ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు ఆర్డీఓకు వినతిపత్రం అందించగా.. స్పందించిన ఆయన షాదీఖాన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ముస్లిం సదర్ సయ్యద్ అలీ, జామియా మసీదు సదర్ ఎండీ హనీఫ్, ఇషాక్, యాకూబ్, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, యాకూబ్ అలీ, ఇబ్రహీమ్, సైదా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

తల్లాడ/ఏన్కూరు: పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం తల్లాడ, ఏన్కూరు లోని పాఠశాలల్లో నిర్వహించిన పీఆర్‌టీయూ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి మండలానికి ఎంఈఓలను నియమించడం అభినందనీయమన్నారు. అనంతరం ఏన్కూరు మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడిగా చింతారాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అదే విధంగా తల్లాడ మండలాధ్యక్షుడిగా ఉంగరాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి గోపాలక్రిష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.సైదులు, ఉపాధ్యక్షుడిగా రామిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా శారదాదేవి, కార్యదర్శిగా సరోజని, గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సైదయ్య, బ్రహ్మారెడ్డి, వైరా మండల అధ్యక్షుడు నర్సింహారావు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే ..

కారేపల్లి: పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి నరేందర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని గాంధీనగర్‌లో కేసగాని రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించి గ్రామశాఖ మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేసి, అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం శాఖా కార్యదర్శిగా ఈసం వెంకటేశ్వర్లు (సలీం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్జా రామారావు, పాయం లింగమూర్తి, ఈసం వెంకటేశ్వర్లు, కేసగాని ఉపేందర్, ఈసం లక్ష్మి, గలిగ వసంత, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బవరంలో సీపీఎం గ్రామసభ

వైరారూరల్: మండలంలోని రెబ్బవరంలో బుధవారం నిర్వహించిన సీపీఎం గ్రామసభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అనంతరం రెబ్బవరం గ్రామ కార్యదర్శిగా తాళ్లూరి నాగేశ్వరరావును నియమించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, కృష్ణారావు, సుధాకర్, శివాజీ, సాయి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ముదిగొండ: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. మండల పరిధిలోని గోకినేపల్లిలో పయ్యావుల ప్రభావతి అధ్యక్షతన సీపీఎం గ్రామశాఖ మహాసభ బుధవారం జరిగింది. సమావేశంలో జిల్లా నాయ కుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

ఏన్కూరు: జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి బి.రాములు కోరారు. బుధవారం మండలంలోని కొత్తమేడేపల్లిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు అందించారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

అట్టహాసంగా జోనల్ క్రీడలు ప్రారంభం..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హైకేర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి

మధిర: పాఠశాలల స్థాయి జోనల్ క్రీడలు బుధవారం మధిరలోని టీవీఎం పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులకు భోజనాలతో పాటు షీల్డ్, మెడల్స్‌లను పలువురు సహకారం అందజేశారు. హై కేర్ ఆస్పత్రి యాజమాన్యం జంగా కోటిరెడ్డి కుమారులు డాక్టర్ నవీన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి ఆర్థిక సహకారంతో సుమారు 1,000 మంది క్రీడాకారులకు భోజనాలు ఏర్పాటు చేశారు. టీవీఎం వాకర్స్ క్లబ్ సభ్యులైన వెంకాయమ్మ.. వారి తల్లి భావన లక్ష్మి జ్ఞాపకార్థం గెలుపొందిన క్రీడాకారులకు షీల్డులు, మెడల్స్ అందజేశారు. టీవీఎం వాకర్స్ క్లబ్ సభ్యులైన పుల్లఖండం సత్యనారాయణమూర్తి, మాటూరు పాఠశాల హెచ్‌ఎం శ్రీహరి, వాకర్స్ క్లబ్ సభ్యులు నాగేశ్వరావు, సుబ్బారావు, రవి బాబు ఆర్థిక సహకారంతో క్రీడాకారులకు భోజనంతో పాటు మంచి బహుమతులు అందించడానికి చక్కటి ఆర్థిక తోడ్పాటు అందించినందుకు మండల విద్యాశాఖ అధికారి, టీవీఎం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, మండల అభివృద్ధి అధికారి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, దండెం సత్యనారాయణ రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు మాటూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్ని, జమలయ్య, చిన్ని, సాంబశివరెడ్డి, నాగేశ్వరరావు, చైతన్య, అజీమ్, వీరయ్య, ఇబ్రహీం పాల్గొన్నారు.

డాన్‌బోస్కో పాఠశాలలో ముగిసిన జోనల్ గేమ్స్..



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రసూన

తల్లాడ: మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో బుధవారం వైరా జోనల్ గేమ్స్ ముగిశాయి. బాలురకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. వైరా, తల్లాడ, కొణిజర్ల, ఏన్కూరు మండలాల స్థాయి పాఠశాలల విద్యార్థులకు రెండు రోజుల పాటు జోనల్ గేమ్స్ జరిగాయి. జోనల్ గేమ్స్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లాస్థాయి గేమ్స్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గేమ్స్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జోనల్ గేమ్స్ కన్వీనర్ ప్రసూన, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, డాన్‌బోస్కో ఫాదర్ ప్రదీప్‌రెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక..

మధు విద్యాలయం విద్యార్థులు..



వైరా: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రాంచరణ్

వైరా: వైరాలోని మధు విద్యాలయానికి చెందిన రాంచరణ్ జిల్లా వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వైరా జోనల్ పరిధిలోని నాలుగు మండలాల క్రీడా పోటీలను తల్లాడలో నిర్వహించగా రాంచరణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి వాలీబాల్ విభాగంలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల యజమాన్యం రాంచరణ్‌ను అభినందించారు.

బీసీ గురుకుల విద్యార్థులు..

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలో గల జ్యోతీబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. సందర్భంగా ఆర్‌సీఓ జ్యోతిర్మయి, ప్రిన్సిపల్ జహీదా, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను, పీఈటీ రవిని అభినందించారు.

మధిర: పట్టణంలోని టీవీఎం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జరిగిన జోనల్‌స్థాయి క్రీడల పోటీలలో భరత్ టెక్నో స్కూల్ విద్యార్థులు సీనియర్, జూనియర్ కబడ్డీ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రమ్య, లాస్య, చంద్రికలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓ ప్రభాకర్, పాఠశాల అధినేత విద్యాలత, పీఈటీలు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్ రెడ్డి, స్రవంతి, నాగరాజు, పాషా, అజీమ్, ప్రసాద్, భవాని, శశికళ తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడల్లో చైతన్య టెక్నోస్కూల్ చాంపియన్



చాంపియన్‌షిప్‌గా నిలిచిన విద్యార్థులు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో స్థానిక గుడిపాడులోని చైతన్య టెక్నోస్కూల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 26 మంది విద్యార్థులు జోనల్ గ్రేమ్స్‌కు అర్హత సాధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు

పెనుబల్లి: వీయంబంజర్ రాజసాయి మందిరం నిర్వాహకుడు జెన్నారెడ్డి నరసింహారెడ్డి ఆర్థిక సాయంతో దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాసులు అందిస్తున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. దివ్యాంగులు 50శాతం సొమ్ము చెల్లించి బస్‌పాస్ పొందవలసి ఉండగా.. జెన్నారెడ్డి నరసింహారెడ్డి ఆ సొమ్మును చెల్లించి దివ్యాంగులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బదిలీ ఎంపీఓకు సన్మానం..

కారేపల్లి: సింగరేణి ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న పర్వీన్ కౌసర్ చింతకాని మండలానికి బదిలీ అయ్యారు. కాగా..బుధవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆమెను మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇదిలా ఉండగా పెనుబల్లి ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఉపేందర్ సింగరేణి ఎంపీఓగా బదిలీపై రానున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమేష్, జీపీ కార్యదర్శులు నాగేశ్వరరావు, నవీన్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గుడ్‌న్యూస్ విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట గుడ్‌న్యూస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్ కోట్ల విజయబాస్కర్ రెడ్డి స్టేడియంలో 22న నిర్వహించిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్ పోటీల్లో పాఠశాలకు చెందిన బి.హారిక, వి.శశివర్ధన్, ఎల్.పరిణీత, జి.ప్రసన్నకుమార్, ఎస్‌కె.సతియా, జి.హర్షిత ప్రతిభ కనబరిచడంతో యాజమాన్యం అభినందించారు.

ర్యాగింగ్, డ్రగ్స్ నిర్మూలనపై సెమినార్



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 'సక్సెస్ వర్సెస్ వెల్‌నెస్'అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్య నిపుణులు జి.అశోక్‌కుమార్, న్యాయవాది పిన్నం జానకీరామయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ మత్తుపదార్థాలకు అలవాటైతే తాత్కాలికంగా మానసిక ఆనందాన్ని కలిగిస్తాయే తప్ప దుష్పరిణామాలే ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ మేరకు మత్తుకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం న్యాయవాది జానకీరామయ్య మాట్లాడుతూ ర్యాగింగ్ చేస్తే ఎదురయ్యే అనర్థాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, యాంటీ ర్యాగింగ్, యాంటీడ్రగ్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.వీ.రామచంద్రరావు పాల్గొన్నారు.

కల్లూరు డివిజన్‌కు చేరిన సాగర్ జలాలు



కల్లూరు ఎన్నెస్పీ డివిజన్‌కు చేరిన సాగర్ జలాలు

కల్లూరురూరల్: నాగార్జున సాగర్ జలాలు బుధవారం సాయంత్రం కల్లూరుకు చేరాయి. పాలేరు జలాశయం నుంచి సాగర్ ఎడమ కాలువకు 2,500 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా బుధవారం సాయంత్రానికి సాగర్ మెయిన్ కెనాల్ 52వ కిలోమీటర్ వరకు చేరాయి. 94వ కిలోమీటర్ కప్పలబంధం రెగ్యులేటర్ వద్దకు నీరు చేరగానే మధిర బ్రాంచ్ కెనాల్‌కు అధికారులు విడుదల చేయనున్నారు. కప్పలబంధం రెగ్యులేటర్ వద్దకు సుమారు 1,000 క్యూసెక్కుల నీరు చేరే అవకాశం ఉంటుంది. ఎగువ ప్రాంత ఆయకట్టు రైతులు నీటి వినియోగం ఎక్కువగా ఉన్నందువల్ల దిగువకు నీటి ప్రవాహం తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మధిర బ్రాంచ్ కెనాల్ నుండి నీటి ప్రవాహ సామర్థ్యాన్ని బట్టి పుణ్యపురం మేజర్‌కు నీరు సరఫరా చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. సాగర్ జలాలను అవసరాన్ని బట్టి పొదుపుగా వినియోగించుకోవాలని, రైతులు సమన్వయం పాటించాలని జలవనరుల శాఖ అధికారులు కోరారు.

అధికారులకు వినతి

కల్లూరురూరల్: బత్తులపల్లి భారీ లిఫ్ట్ ఇరిగేషన్‌కు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నాలుగు నెలలైన ట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడంతో పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం అధికారి ఆనందబాబుకి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన 250కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామనగా.. రైతులు తమకు 400కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కావాలని.. లేకపోతే చివరి భూములకు నీరందరక పంటలు ఎండిపోతాయన్నారు. అయితే సాధ్యమైనంత వరకు ఈనెల చివరిలోగా ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

వీఆర్‌ఏల సమస్యలపై తహసీల్దార్లకు..

చింతకాని/తల్లాడ: వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల వీఆర్‌ఏలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చింతకాని, తల్లాడ తహసీల్దార్లు కూరపాటి అనంతరాజు, రవికుమార్ లకు వినతిప్రతాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరణించిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలనిజీవో నంబర్ 81, 85కు ముందు చనిపోయిన వీఆర్‌ఏ వారసులకు కారుణ్య నియామయాల ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు ఏప్రభుత్వం కూడా ఆ అవకాశం కల్పించలేదన్నారు. 2023 మే 22న సీసీఎల్ నుంచి ఇచ్చిన సర్క్యులర్‌ను తొలగించి వారసులకు ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు, వారి వారసులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

మధిర: ఇటీవల వరద ముంపునకు గురైన వరద బాధితులకు మండల ఆర్యవైశ్య సంఘం విజ్ఞప్తి మేరకు కలకత్తాలోని బేలూరి మఠం రామకృష్ణ మిషన్ సహకారంతో బుధవారం రామకృష్ణ సేవా సమితి ఆవరణలో బాధితులకు స్వామి పూజానంద నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య నాయకుడు దేవకి వాసుదేవరావు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి విచారణ పరిధిలో..

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి ఆర్‌సీఎం చర్చి విచారణ పరిధిలోని పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, వెంకటాపురం గ్రామాల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో 53వేల రూపాయల విలువ చేసే బియ్యం, దుప్పట్లు, కొత్త చీరలు, డ్రెస్‌లను పెద్దకోరుకొండి విచారణ గురువులు స్టీఫెన్ ఆధ్వర్యంలో ఖమ్మం క్రైస్తవ పీఠాధిపతి నగిలి ప్రకాష్‌కు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల క్రైస్తవ సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు..

సత్తుపల్లిటౌన్: హోప్ మినిస్ట్రీస్, ఎస్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ఆధ్వర్యాన సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లోని 100 మంది నిరుపేద మహిళలకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో హోప్‌మినిస్ట్రీస్ డైరెక్టర్ శ్యామ్యూల్ జాషువా గడ్డెం, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, పింగలి సామేలు, గ్రాండ్ మాలాలీ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని గౌరిగూడెంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షుడు సింగిరెడ్డి కేశవరెడ్డి బుధవారం రూ.15వేల విలువైన దుప్పట్లను పేదలకు పంపిణీ చేశారు. అమెరికాలో ఉంటున్న తన కుమారుడు, కోడలు సింగిరెడ్డి దినేష్‌రెడ్డి, హారిక దంపతుల కుమార్తె ఆరుషి పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండి నిరంజన్‌రెడ్డి, పి.సత్యనారాయణరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి అర్పించిన మంత్రి, ఎమ్మెల్యే

తల్లాడ: మండలంలోని ముద్దునూరు మాజీ సర్పంచ్ యరమల వెంకటేశ్వరరెడ్డి మంగళవారం మృతి చెందగా బుధవారం స్వగ్రామమైన రంగాపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, నరసింహారావు, వీరారెడ్డి, డాక్టర్ రామకృష్ణ, రవిప్రసాద్, నీరజా ప్రభాకర్‌చౌదరి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కేంద్రం చట్టం చేయాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ

కొణిజర్ల: ప్రభుత్వాలు మారినా మహిళలపై అఘాయిత్యాలు తగ్గడం లేదని మహిళా సాధికారతకు కేంద్రం పకడ్బందీ చట్టం తయారు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. బుధవారం కొణిజర్లలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో తాళ్లపల్లి విజయ అధ్యక్షతన నిర్వహించిన ఐద్వా మండల మహాసభలో ఆమెతో పాటుగా సంఘం జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం పథకం అమలు చేయాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సరోజినీ, తాతా పద్మలతో పాటు మరో 13 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకురాలు పద్మ తిలకం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ, వైరా డివిజన్ ఇన్‌చార్జ్ రమణ, హేమలత, నాగమణి పాల్గొన్నారు.

'వరద బాధితులకు అన్యాయం'

మధిర: ఇటీవల కురిసిన వర్షాలకు పలుగ్రామాల ప్రజలు నష్టపోయారని, వారికి ప్రభుత్వం సాయం అందించకుండా అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా నాయకుడు శీలం నరసింహారావు అన్నారు. ఈ మేరకు బుధవారం సీపీఎం నాయకులు తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయతో పాటుగా సీపీఎం మండల కార్యదర్శి మంద సైదులు మాట్లాడుతూ.. ఈ సమస్యపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకోకపోతే బాధితులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మద్దాల ప్రభాకర్, తేలపోలు రాధాకృష్ణ, విల్సన్, శ్రీనివాసరావు, కొండయ్య, సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

ముదిగొండ: ముదిగొండలోని భూపోరాట అమరవీరుల స్తూపం వద్ద భూపోరాట అమరవీరులకు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరికి సీపీఎం నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు బుధవారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో బుధవారం టీపీటీఎఫ్ మండలం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.విజయ్, పరిశీలకుడిగా ముత్తయ్య వ్యవహరించారు. మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భూషణ్‌రాజు, సీతారామయ్య, ఉపాధ్యక్షులుగా రేణుక, సూర్యనారాయణలు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా శంకర్, కరీముల్లా, సత్యవతి, అడహక్ కమిటీ కన్వీనర్‌గా కరుణ, కళావతి ఎన్నిక కావడం జరిగింది. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా భాసన్, గురుమూర్తి, హనుమంతరావు, వెంకటనర్సయ్యలు పాల్గొన్నారు.

సమాజం స్వచ్ఛంగా ఉండాలి



సత్తుపల్లి అర్బన్‌పార్కు వద్ద నర్సింగ్ విద్యార్థినులు

మధిర: భారత్ కల సాకారం కావాలంటే సమాజంతో పాటు ప్రతీ వ్యక్తి మనసు కూడా స్వచ్ఛంగా ఉండాలని మధిర కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం కోర్టు అధికారులు, సిబ్బంది ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. పరిసరాల – పరిశుభ్రత మన బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం హ్యూమన్ రైట్స్ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు (కే.వీ.ఆర్)లతో కలిసి కోర్టు ఆవరణలో ఉన్న చెత్తను, ప్లాస్టిక్ కవర్లను శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ షఫీ ఉల్లా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత అవగాహన ర్యాలీ..

సత్తుపల్లి: ఎన్‌ఎస్‌ఎస్ డేను పురస్కరించుకొని సత్తుపల్లి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బుధవారం స్వచ్ఛభారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జోష్న, ఎన్‌ఎస్‌ఎస్, పాల్గొన్నారు.

సత్తుపల్లి మున్సిపాలిటీలో..

స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్తుపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యాన పట్టణంలోని హైస్కూల్స్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.రవి బాబు, వార్డ్ ఆఫీసర్లు, పర్యావరణ ఇంజనీర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి

మధిర: గురుకుల విద్యాలయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ మహేష్‌కు టీఎస్ యూటీఎఫ్ గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్‌వలితోపాటు నాయకులు మాట్లాడారు. ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమలో టీఎస్ యూటీఎఫ్ మైనారిటీ గురుకుల వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్, టీఎస్ యూటీఎఫ్ బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సురేష్, సోషల్ వెల్ఫేర్ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సాంసన్, మధిర ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ లక్ష్మణరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, మండల అధ్యక్ష కార్యదర్శులు వినోద రావు, వీరయ్య, మండల శాఖ అధ్యక్షుడు ఇబ్రహీం, మల్లరాజు, రమేష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాల అటానమస్‌ను ఆమోదించిన కేయూ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇటీవల మంజూరైన స్వయం ప్రతిపత్తి హోదాను కాకతీయ విశ్వవిద్యాలయం ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కళాశాలను సందర్శించి ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు. కళాశాలకు సీసీరోడ్డు నిర్మాణానికి అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

మధిర: వచ్చేనెల 24న జరిగే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ద సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.మస్తాన్ కోరారు. బుధవారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలుగా బాధ్యతలు స్వీకరణ

సత్తుపల్లి ఎంఈఓగా నక్కా రాజేశ్వరరావు..



రాజేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఎంఈఓగా నక్కా రాజేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 20ఏళ్లుగా హెచ్‌ఎంగా పని చేయటంతో పాటు సత్తుపల్లి మండల విద్యానోడల్ అధికారిగా పని చేస్తున్నారు. ఇదే విధంగా ఉపాధ్యాయ సంఘాలు, నాయకులు రాజేశ్వరరావును కలిసి సత్కరించారు.


పెనుబల్లికి సత్యనారాయణ..



పెనుబల్లి: శుభాకాంక్షలు చెబుతున్న ఉపాధ్యాయులు

పెనుబల్లి: పెనుబల్లి మండల ఎంఈఓగా ఎస్.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీయంబంజర్ జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రుపాలెం ఎంఈఓగా మురళీమోహన్‌రావు



మురళీమోహన్‌రావు

ఎర్రుపాలెం: మండల విద్యాశాఖాధికారిగా బి.మురళీమోహన్‌రావు బుధవారం మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన మండలంలోని మీనవోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నారు.

ముదిగొండ ఎంఈఓగా రమణయ్య..

ముదిగొండ: ముదిగొండ మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా రమణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్ఎన్ నోడల్ ఆఫీసర్‌గా ఉన్న ఆయనను మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా నియమించారు.

చింతకానికి.. శ్రీనివాసరావు

చింతకాని: మండల విద్యాశాఖాధికారిగా వీరపనేని శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన మత్కేపల్లి ఉన్నత పాఠశాల మెచ్‌ఎంగా.. మండల నోడల్ అధికారిగా పనిచేస్తున్నారు.

బోనకల్ ఎంఈఓగా పుల్లయ్య..



పుల్లయ్య

బోనకల్: మండలంలోని కలకోట గ్రామానికి చెందిన దామాల పుల్లయ్య ఎంఈఓగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తు తం ఆయన రావినూతల ఉన్న త పాఠశాల హెచ్‌ఎం, నోడల్ అధికారిగా పనిచేస్తున్నారు.

ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన అబ్రహం



అబ్రహం

కొణిజర్ల: కొణిజర్ల మండల విద్యాధికారిగా దొడ్డిగర్ల అబ్రహం బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కొణిజర్ల ఎంఈఓగా పని చేసిన శ్యాంసన్ బదిలీపై ఖమ్మం జలగం నగర్ ఉన్నత పాఠశాలకు వెళ్లినప్పటికీ ఆయనే ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా శ్రీనివాస్

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను ఇన్‌చార్జ్ ఎంఈఓగా నియమించారు. ఈ మేరకు స్థానిక మండల వనరుల కేంద్రంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా పని చేసిన దుగ్గిరాల జయరాజు కారేపల్లికి బదిలీపై వెళ్లారు.